
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

ఆదివారం 25 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.70 (311.1486)	69,284	40,070
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.65 (4.10)	1650.91	1949.74
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	30,520	28,631

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



పాడి రైతులకు

పశుగ్రాసం కొరత

వానాకాలంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. రానున్న రోజుల్లో అంటే వేసవి కాలంలో పశుగ్రాసానికి గడ్డుకాలం ఏర్పడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో భూముల విలువ పెరగడం, రైతులు పశువులకు ఏ మాత్రం భూమి వదలకుండా వరి, పత్తి పంటలు సాగుచేయడంతో పశువుల గడ్డికి బీడు భూములు లేకుండా పోయాయి. పశుగ్రాసం కొరత తీరాలంటే రైతులు వ్యవసాయ భూముల్లో కొంత భాగాన్ని గ్రాసానికి కేటాయించాలని, దీంతో పాలు, మాంసం ఉత్పత్తి పెరిగి రైతులకు ఆర్థికంగా తోడ్పాటు కలుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

\- నల్లగొండ

- రానున్న రోజుల్లో మరింత గడ్డుకాలమే
- గ్రాసం కొరత తీర్చేందుకు అధికారుల ప్రణాళికలు
- ఉమ్మడి జిల్లాలో సబ్సిడీపై 155క్వింటాళ్ల విత్తనాలు

ఉమ్మడి జిల్లాలో 10లక్షలకు పైగా పశుసంపద ఉంది. గేదెలు, ఆవులతో పాటు ఎద్దులు, మేకలు,గొర్రెలు, తదితర జీవాలకు పశుగ్రాసం అవసరం. అయితే రైతులు పూర్తిగా ట్రాక్టర్లతో వ్యవసాయం చేస్తుండటంతో పశుగ్రాసంపై దృష్టి సారించడం లేదు. అవసరం అనుకుంటే కొంత గడ్డిని కొనుగోలు చేస్తే సరిపోతుందని, ప్రత్యేకంగా పశుగ్రాసం పెంపకానికి భూమి, నీరు కేటాయించాల్సి వస్తుందన్న భావంతో రైతులు పట్టించుకోకపోవడంతో గ్రాసం సమస్య తీవ్రమైంది. ఈ నేపథ్యంలో పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేసి ఆ తరువాత ఇతర పశువుల అవసరాలకోసం గడ్డిని సేకరించే ప్రయత్నాలు అధికారులు చేపట్టనున్నారు.

ఇతర జిల్లాల నుంచి ఎండుగడ్డి కొనుగోలు

ఉమ్మడి జిల్లాలో పశుగ్రాసం కొరత కారణంగా మూగజీవాలు అర్థాకలితో అలమటిస్తున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లాలో 14లక్షలకు పైగా పశుసంపద ఉండగా ప్రస్తుతం 10 లక్షలకు పడిపోయింది. రైతులు యాంత్రీకరణపై దృష్టి సారించి పశువులను కొనుగోలు చేయలేక గడ్డి తెచ్చి మేపలేక పాడిని దూరం పెడుతున్నారు. ఇక పాడి ఉన్న రైతులు పశుగ్రాసం కారణంగా ఇతర జిల్లాల నుంచి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ గడ్డికి రూ.2,500 నుంచి రూ.3వేల వరకు ధర ఉంది. వరి నూర్పిడి సమయంలో హార్వేస్టర్లతో కోతలు సాగిస్తుండటంతో ఆ గడ్డి పనికి రాకుండాపోతోంది. కొందరు రైతులు వరి కోతల సమయంలో గడ్డి కట్టలను యంత్రాల ద్వారా చుట్టి ఉంచి విక్రయిస్తున్నారు. పెరిగిన ధరల కారణంగా పాల ఉత్పత్తులపై ఆధారపడే రైతులకు గడ్డి కొనుగోలు భారంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో వాణిజ్య పంటలతో పాటు మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేసేవారు. దీంతో వాటి సొప్ప పచ్చి మేతగా పాడి పశువులకు ఉపయోగపడేది. కానీ ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది.

గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్నాం. 75శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని అన్ని పశుసంవర్ధకశాఖ కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పశుసంపద ఉన్న రైతులు వీటితో గ్రాసాన్ని పెంచి పాల దిగుబడి పెంచుకోవాలి.

\- సదానందం, నల్లగొండ జిల్లా పశువైద్యాధికారి

పచ్చిమేతతో పాల ఉత్పత్తులను పెంచేలా

ఉమ్మడి జిల్లాలో పశుగ్రాసం కొరత నివారించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పాడి పశువులకు పచ్చిమేత కోసం 75శాతం సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలు అందుబాటులోకి తెచ్చింది. ప్రధానంగా పాడి రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని నిర్ణయించి ఉమ్మడి జిల్లాలో 155మెట్రిక్ టన్నుల పశుగ్రాసం విత్తనాలను జిల్లా పశుసంవర్ధక శాఖకు కేటాయించింది. ఈ విత్తనాలు అన్ని పశుసంవర్ధకశాఖకు చెందిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 5కిలోల గడ్డి విత్తనాల సంచి ధర రూ.455 కాగా, ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో రూ.144కే అందజేస్తోంది. నల్లగొండ జిల్లాకు 120మెట్రిక్ టన్నులు, యాదాద్రి జిల్లాకు 25 క్వింటాళ్లు, సూర్యాపేట జిల్లాకు 10క్వింటాళ్ల గడ్డి విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. గతంలో పశుసంవర్ధక శాఖను సబ్సిడీ విత్తనాల గురించి ఇండెంట్ కోరగా, నల్లగొండ జిల్లాకు అత్యధికంగా విత్తనాలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఆయా జిల్లా ఇండెంట్ ప్రకారం విత్తనాలను కేటాయించారు. ఈ విత్తనాలను పశుసంపద కలిగిన రైతులకు సబ్సిడీపై ఇవ్వనున్నారు. ఈ విత్తనాలు ఒకసారి వేస్తే పలుమార్లు సార్లు కటింగ్ చేస్తూ గ్రాసాన్ని ఉపయోగించుకోవచ్చు. పచ్చిమేత ద్వారా పాలదిగుబడులు సైతం పెరుగుతాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పాల దిగుబడి తగ్గిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. జిల్లా నుంచి గతంలో పాల ఎగుమతి ఉండగా, ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీల పాల ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు.



భారంగా మారిన పశుపోషణ

పశు పోషణ పాడి రైతులకు భారంగా మారింది. దీనితోనే రైతులు పశుసంపదను తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున పాల ఉత్పత్తులతో ఆర్థికంగా గట్టెక్కేవారు. ప్రతీ రోజు వివిధ కంపెనీలకు 2.50లక్షల లీటర్లకు పైగా పాలు ఎగుమతి చేసి 15 రోజులకోసారి పాడి రైతులు డబ్బు పొందేవారు. దీంతో వారికి ఆర్థికంగా వెసులుబాటు కలిగేది. ప్రస్తుతం పాలదిగుబడి 50శాతానికి పడిపోయింది. పచ్చిమేత, దాణా ధరలు పెరిగాయి. దీంతో పాడి గేదెలతోపాటు ఆవులను పెంచేందుకు రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే పశుగ్రాసం విత్తనాలకు సబ్సిడీ ఇచ్చి పశుసంపదను పెంచేలా ప్రణాళిక అమలుచేస్తోంది.



మహా మాయగాళ్లు

- నీటి జాడ పడతామంటూ మోసం
- కొబ్బరికాయలు, పుల్లలే పరికరాలు
- బోరు పాయింట్‌కు రూ.1,000 నుంచి రూ.2వేల వరకు వసూలు

మిర్యాలగూడ(వ్యవసాయం), ఆగస్టు 24: ఓ సన్నకారు రైతుకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో బోర్లు వేయడానికి సిద్ధపడ్డాడు. కొబ్బరికాయలతో బోరు పాయింట్లు పెట్టే వ్యక్తిని ఆశ్రయించాడు. ఒక్క పాయింట్‌కు రూ.1,000 తీసుకుని ఆరు పాయింట్లు పెట్టాడు. ఆ రైతు బోరు బండి తీసుకువచ్చాడు. నీరు పడకపోవడంతో ఒక దాని తరువాత ఒకటి ఆరు బోర్లు వేశాడు. అంతా రాయి ఉండటంతో దుమ్ము తప్ప చుక్క నీటి జాడ లేదు. ఒక్కో బోరు 100 అడుగుల నుంచి 200అడుగుల వరకు వేశాడు. ఒక్క పాయింట్‌కు రూ.30వేల వరకు ఖర్చు వచ్చింది. మొత్తం ఆరు పాయింట్లకు రూ.1.80లక్షల వ్యయం అయింది. ఇదేంటని సదరు బోరు పాయింట్లు పెట్టిన వ్యక్తిని అడగ్గా, నీకు అదృష్టం లేదు.. చుట్టు పక్కల అందరికి నీళ్లు పుష్కలంగా పడ్డాయి.. అని సమాధానమిచ్చాడు. ఆ రైతుకు ఏం చేయాలో పాలుపోక బాధగా ఇంటికి చేరాడు. ఇది ఓ రైతు సమస్య కాదు. సాగర్ ఆయకట్టులో గత ఏడాది నీటి విడుదల లేకపోవడంతో రైతులు వేల బోర్లు వేసి కోట్ల రూపాయలు నష్టపోయారు.

సాంకేతిక పరిజ్ఞానం పురోగతి సాధిస్తున్నా సమాజాన్ని మూఢత్వం మాత్రం వీడటం లేదు. రైతుల అవసరాలను ఆసరా చేసుకొని బోరు పాయింట్లు పెట్టే మోసగాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చారు. సులువుగా డబ్బు సంపాదించే అవకాశం ఉండటంతో సాగర్ ఆయకట్టులో ప్రతీ గ్రామానికి ఒకరిద్దరు కొబ్బరికాయతో మాయాజాలం ప్రదర్శించడం మొదలు పెట్టారు. రోజుకు 10 నుంచి 15 బోరు పాయింట్లు పెట్టే అవకాశం రావడంతో చెమటోడ్చకుండానే వేల రూపాయలు సంపాదించారు.

ఆయకట్టు జల్లెడ, నష్టపోయిన రైతులు

గత ఏడాది సాగర్ ఆయకట్టులో ఒక్కో మండలంలో సుమారు 500లకు పైబడి బోర్లు వేశారు. ఒక్కో బోరుకు రూ.30వేల వరకు వెచ్చించడంతో రూ.15కోట్ల వరకు ఖర్చయిందని అంచనా. ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టులో సుమారు 12మండలాలు ఉన్నాయి. అంతా కలిపితే రూ.180కోట్ల వరకు వ్యయమైందని అంచనా. రైతులు ప్రయాసలు పడి బోర్లు వేసినా వాటిలో 90శాతం బోర్లలో నీటి లభ్యత లేదు. దాదాపు ఇవన్నీ ఈ అశాస్త్రీయ పద్ధతిలో ఎంచుకున్న బోర్లే.

ఆధునిక పద్ధతి మహా ఖరీదు

రైతులు బోర్ల పాయింట్ల ఎంపికకు అశాస్త్రీయ పద్ధతిని ఎంచుకోవడానికి ప్రధాన కారణం ఆధునిక పద్ధతిలో నీటి జాడచూసే జియాలజిస్టుల కొరత ఉంది. హైదరాబాద్, పట్టణ ప్రాంతాల్లో ఉండే జియాలజిస్టులను తీసుకురావడం చాలా ఖరీదైన ప్రక్రియ. రాను పోనూ ఖర్చులతో పాటు ఒక్కో పాయింట్‌కు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇది రైతులకు భారంగా మారింది.

అశాస్త్రీయతతో రైతులు నష్టపోతున్నారు

చాలా కాలంగా కొబ్బరికాయలు, కర్ర పుల్లలతో బోరు పాయింట్లు గుర్తించే ప్రక్రియ రాష్ట్రంలో సాగుతోంది. వాటికి ఎటువంటి శాస్త్రీయత లేదు. వాస్తవంగా నీటికి ఎటువంటి ఆకర్షణ ఉండదు. భూగర్భంలో ఉన్న నీటిని ఎటువంటి సాంకేతికత లేకుండా గుర్తించడం కష్టం. చాలా మంది ఈ అశాస్త్రీయతను ఉపాధిగా మార్చుకున్నారు. ఇటువంటి పద్ధతులను రైతులు నమ్మి మోసపోవద్దు. తప్పనిసరిగా శాస్త్రీయ పద్ధతినే అనుసరించాలి. ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు సహకారం అందించాలి.

\- రామచంద్రయ్య, వరంగల్ నిట్ విశ్రాంత ఆచార్యులు, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు

అంతా అశాస్త్రీయమే

సాంకేతికత అభివృద్ధి చెందక ముందు కొబ్బరికాయ, పుల్లలు వివిధ ఆ శాస్త్రీయ పద్ధతుల్లో బోరు పాయింట్లు పెట్టేవారు. కాలక్రమణలో భూగర్భశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందినా రైతులు ఆ పాత విధానంతోనే అదృష్టాన్ని పరిరక్షించుకుంటున్నారు. ఈ తరహా పాయింట్లు పెట్టే వాళ్లు కొబ్బరి కాయను అర చేతిలోకి తీసుకుని బోరు పాయింట్ పెట్టే ప్రాంతమంతా కలియతిరుగుతారు. నీళ్లు ఉన్న చోట కాయ, చేయి మణికట్టు వైపు లేస్తుంది. ఇదంతా ఓ కనికట్టు. చేయి కదిలే స్థాయిని అనుసరించి కొబ్బరికాయ లేవడం సర్వ సాధారణం. మరికొంత మంది చింత, వేపకు పుల్లను రెండు చేతుల మధ్యలో ఉంచుకుని పొలమంతా తిరుగుతారు. నీటి జాడ ఉన్న దగ్గర పుల్ల నిటారుగా నిలబడుతుందని చెబుతారు. చేతి స్పర్శతో ఇదీ జరుగుతుంది తప్ప ఎటువంటి శాస్త్రీయత ఉండదని పరిశోధకులు చెబుతున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క ఇల్లూ ఇవ్వలేదు

- డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో గత ప్రభుత్వ వైఫల్యం
- మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఆగస్టు 24: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కాదు కదా సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని మంత్రి నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి 3,500గృహాలు నిర్మిస్తామన్నారు. హుజూర్‌నగర్‌లో 2012లో మొదలు పెట్టిన మోడల్ కాలనీ ఇళ్లను రాజకీయ దురుద్దేశంతోనే 2,116 ఇళ్లు 70 శాతం పూర్తయినా, బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో ఒక్కరూపాయి నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రం మొత్తంలో కూడా బీఆర్‌ఎస్ హయాంలో డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ చేయడంలో ఘోర వైఫల్యం చెందారన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 2,116 ఇళ్లు పూర్తి చేసి పేదలకు ఉచితంగా ఇళ్లు అందిస్తామన్నారు. సంక్రాంతి నాటికి పేదలు ఇళ్లల్లో గృహ ప్రవేశం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోనే హుజూర్‌నగర్ మోడల్ కాలనీ ఆదర్శ మోడల్ కాలనీగా అవతరించబోతుందన్నారు. అనంతరం పట్టణంలో శ్వేత నర్సింగ్ హోమ్, విజయనర్సింగ్‌హోమ్, ఎడ్యుకేషనల్ అకాడమిలను మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. సమావేశంలో గెల్లి అర్చన, రవి, గూడెపు శ్రీను, సాముల శివారెడ్డి, దొంతగాని శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గోపిరెడ్డి, చిన్నా సహదేవరావు, మల్లికార్జున్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, ఈడ్పుగంటి సుబ్బారావు, అట్లూరి హరిబాబు, శ్రావణ్, మంజుల, శ్వేత, పాల్గొన్నారు.

ఆరు లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చాం

మఠంపల్లి: రాష్ట్రంలో చిన్న చిన్న లిఫ్టులు, ప్రాజెక్టుల ద్వారా ఆరు లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామంలో కొలువైన శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో రూ.50లక్షలతో రాజాగోపురం నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ త్వరలో లిఫ్టులలో ప్రభుత్వపరంగా సాంకేతికంగా నడిపేందుకు ఎలక్ట్రీషియన్, పంపు ఆపరేటర్లను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు నియమించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. సంక్రాంతి నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి రేషన్ దుకాణాల ద్వారా సన్నరకం బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, దేవాదాయ ధర్మదాయ శాఖ ఉమ్మడి అసిస్టెంట్ కమిషనర్ సులోచన, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మంగా రాథోడ్, ఈవోలు ఎంపీ లక్ష్మణరావు, కొండారెడ్డి, నాయకులు భూక్య మంజూనాయక్, ఆధూరి కిషోర్‌రెడ్డి, సింగారపు అరుణసైదులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.38లక్షలతో నిర్మించిన గోదాంను మంత్రి ప్రారంభించారు.

రఘునాథపాలెంకు మంత్రి వరాలజల్లు

మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో సుమారు రూ.40లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాంను మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.కోటితో షాదీఖానా, రూ.కోటితో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, రూ.50లక్షలతో ఎస్సీ కాలనీల్లో సీసీరోడ్లు ఏర్పాటు, రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.5లక్షలతో బస్టాండ్ ఏర్పాటుకు మంత్రి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలి

జిల్లా సివిల్ జడ్జి శ్రీవాణి



ఖైదీలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి పి. శ్రీవాణి

సూర్యాపేటలీగల్, ఆగస్టు 24: సమాజంలో ప్రతీ పౌరుడు సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా లీగల్ సర్వీస్ ఆథారిటీ సెక్రెటరీ, సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్‌జైలును పరిశీలించి, ఖైదీలతో మాట్లాడారు. కక్షలు, అనాలోచిత నిర్ణయాలు, కోపాలతో జీవితాలు రోడ్డున పడుతాయన్నారు. జైలు జీవితం నేరస్థులలో పరివర్తన తీసుకువస్తుందన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడవద్దన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి ప్రభుత్వం ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వసంత సత్యనారాయణ పిళ్లై యాదవ్, డిప్యూటీ చీఫ్‌లీ గల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, పెండెం వాణి, సీనియర్ న్యాయవాదులు పోలెబోయిన నర్సయ్యయాదవ్, టింగిలికార్ రమేష్, పల్లేటిరాముడు న్యాయవాదులు పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం!

- డీసీహెచ్‌ఎస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఇష్టారాజ్యం
- ఇతరుల వేతనాలు తన ఖాతాలోకి మళ్లింపు



జిల్లా ఏరియా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్) కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కనుసన్నల్లో కొనసాగుతోంది. అక్కడ అవినీతి, అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది. పర్యవేక్షించాల్సిన అధికారి నిర్లక్ష్యంగా ఉండటంతో పాటు జూనియర్ అసిస్టెంట్ అక్రమాలకు వత్తాసు పలుకుతూ తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల జూనియర్ అసిస్టెంట్ హుజూర్‌నగర్‌కు బదిలీ అయినా ఇంకా డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలోనే అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు. అధికారి హవా ఏమేరకు నడుస్తుందే దీనినిబట్టే అర్థమవుతోంది. అంతేకాకుండా వివిధ విభాగాలకు సంబంధించి రూ.లక్షల్లో దండుకున్నట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపిస్తే విస్తుపోయే నిజాలు బహిర్గతం కానున్నాయి.

\- (సూర్యాపేట-కలెక్టరేట్)

తొమ్మిదేళ్లుగా డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్ ఇటీవల హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అయితే జూలై 26 నుంచి అక్కడే విధులు నిర్వహించాల్సి ఉన్నా, అక్కడ రిపోర్ట్ చేసి తిరిగి అనధికారికంగా కలెక్టరేట్‌లోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తన పలుకుబడి ఉపయోగించి జూనియర్ అసిస్టెంట్‌ను సీనియర్ అసిస్టెంట్‌గా బైపోస్టులో చూపించి ఆపోస్టుకు కొత్తగా ఎవరూరాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. త్వరలో సంబంధిత ఉద్యోగానికి ప్రమోషన్ ఉండడంతో ప్రమోషన్ రాగానే ఆ పోస్టులో తానే పోస్టింగ్ పొందడం కోసం ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నట్లు పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేకపోయినా డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటంపై డీసీహెచ్‌ఎస్‌ను వివరణ కోసం సంప్రదించడంతో తప్పులను సరిచేయడం కోసం సదరు జూనియర్ అసిస్టెంట్ ను ఈ నెల 20న హుజూర్‌నగర్‌కు పంపినట్లు సమాచారం. అంతేకాకుండా చేసిన తప్పులను సరి చేసుకునే ప్రయత్నాల్లోనూ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

పోస్టింగ్‌ల కోసం డబ్బులు వసూలు

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఉద్యోగ నియామకపత్రాలు పొందారు. వారికి జిల్లాలో పోస్టింగ్‌లు కేటాయించే విషయంలో ఒక్కొక్కరి నుంచి వేలల్లో డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. జిల్లాకు 52మందిని కేటాయించగా మూమెంట్ ఆర్డర్లు, ఎంప్లాయ్ ఐడీతో పాటు పోస్టింగ్ కేటాయించడం కోసం రూ.5 వేల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇతర ఉద్యోగుల వేతనాలు తన అకౌంట్లో

డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సదరు జూనియర్ అసిస్టెంట్ మాత్రం తన వేతనంతో పాటు ఇతర ఉద్యోగుల వేతనాలు కూడా కొంత మొత్తంలో తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఉద్యోగులు సరెండర్ సెలవుల వేతనాల క్లెయిమ్ కోసం కార్యాలయంలో దరఖాస్తులు చేస్తున్నారు. అయితే వారికి సరెండర్ వేతనాలు మంజూరైనా వారికి విషయాన్ని తెలపకుండా మంజూరు కాలేదని నమ్మిస్తూ వారి వేతనాలను తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నట్లు సమాచారం.

అనధికారికంగా విధుల నిర్వహణ

ఇటీవల హుజూర్‌నగర్‌కు బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ తిరిగి అనధికారికంగా డీసీహెచ్‌ఎస్ కార్యాయంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహించే వా రు ఎవరూ లేరు. కార్యాలయంలో జరిగిన అక్రమాల విషయం తన దృష్టికి రాలేదు. జూనియర్ అసిస్టెంట్ బ్యాంకు ఖాతాకు ఇతర ఉద్యోగుల వేతనాలు జమ చేసుకున్నట్లు సమాచారం లేదు.

\- వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్

పీజీ వైద్యుల శిక్షణలో చేతివాటం

పీజీ కోర్సును పూర్తిచేసిన వైద్యులు నిబంధనల మేరకు సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా ఏడాది పాటు వైద్య సేవలందించాలి. అందుకుగాను నెలకు రూ.90వేలకు గౌరవ వేతనం ఇస్తారు. ఒకవేళ ఎంబీబీఎస్ అనంతరం ప్రభుత్వ విభాగంలో వైద్యుడిగా ఉద్యోగం పొందిన వైద్యులకు జిల్లా రెసిడెన్షియల్ ప్రోగ్రాంలో మాత్రం వారికి నెలకు ప్రభుత్వం ఎంత వేతనం చెల్లిస్తుందో అంతే చెల్లించాల్సి ఉంది. కానీ సంబంధిత వైద్యులు వారికి కేటాయించిన ఆస్పత్రులకు రాకున్నా జిల్లా రెసిడెన్షియల్ ప్రోగ్రాంలో లేకున్నా, కొన్నిరోజులు మాత్రమే హాజరైనా వారికి మాత్రం పూర్తి కాలానికి వేతనాలను చెల్లించారు. అనంతరం వారికి అటెండెన్స్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. అందుకు ఒక్కో వైద్యుడి నుంచి సుమారు రూ.2లక్షలకు పైగా దండుకున్నట్లు సమాచారం. అంతేగాక రెసిడెన్షియల్ ప్రోగ్రాంలో భాగంగా ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో విధులు నిర్వహించిన పీజీ వైద్యులు వారి జాబ్‌చార్ట్‌ను సమర్పించాలి. కానీ ఇలాంటివి ఏమీ కూడా వారు చేయలేదు. అన్నీ తానై డీసీహెచ్‌ఎస్, జూనియర్ అసిస్టెంట్ ఈ తతంగాన్ని నడిపించారు. రెసిడెన్షియల్ ప్రోగ్రాంలో కోదాడ, హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రులు, నడిగూడెం సీహెచ్‌సీలో పనిచేసిన వారి వివరాలను పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి రానున్నాయి.

పరిధికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్



మెడికల్ షాపులో తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో నిరంజన్

మునగాల, ఆగస్టు 24: గ్రామీణ వైద్యులు పరిధికి మించి వైద్యం చేసి, ప్రజల ప్రాణాలతో చలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న క్లినిక్‌లపై జిల్లా వైద్య బృందం నాలుగు టీమ్‌లుగా ఏర్పడి ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో నిరంజన్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు యాంటిబాటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఉపయోగిస్తున్నారన్నారు. అదేవిధంగా క్లినిక్‌లో బెడ్స్ ఏర్పాటుచేసి పట్టా పొందిన వైద్యులుగా చలామని అవుతూ, ప్రజల జీవితాలతో చలగాటమాడుతున్నారన్నారు. అధిక డోస్ ఉపయోగిస్తున్న ఆర్‌ఎంపీల నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌వోకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీందర్, ఎస్‌యూవో సముద్రాల సూరి, గజగంటి ప్రభాకర్, లక్ష్మీనారాయణ, ఇందిరాల రామకృష్ణ, లింగం రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలి

మండల కేంద్రంలో గత 15ఏళ్ల క్రితం ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతం నుంచి వచ్చిన గ్రామీణ వైద్యుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంలో ఆంతర్యమేమిటని సామాజికవేత్తలు కె.వెంటేష్, ఎన్.రామదాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న ఆర్‌ఎంపీపై జిల్లా ఉన్నత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో మేలుకొల్పిన అర్చనస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోర్చనలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకారమండపంలో సుదర్శన హోమం నిత్య కల్యాణోత్సవం, ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను వేదికపై తీర్చి దిద్ది సుదర్శనశతక పఠనాలతో హవనం నిర్వహించారు.అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్ర రీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు, సాయంత్రం అలంకరణ వెండి జోడుసేవలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు జరిగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.33,43,605ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

బ్యాంకు మేనేజర్ అరెస్ట్

నూతన్‌కల్, ఆగస్టు 24: ఖాతాదారుల పేరిట రుణాలు తీసుకుని సొంత అవసరాలకు మళ్లించిన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం తాళ్లసింగారం ఎస్‌బీఐ మేనేజర్‌ను అరెస్టు చేసినట్లు తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని తాళ్లసింగారం, సోమ్లాతండా, టీక్యతండా గ్రామాల బ్యాంక్ ఖాతాదారులకు తెలియకుండా మేనేజర్ సంగీ హరిప్రసాద్ ముద్ర యూనిట్లు తొమ్మిది, పీఎంఎఫ్ఎంఈ యూనిట్లు 12, ఎస్‌హెచ్‌జీ సంఘాలు 11, కేసీసీ 12 యూనిట్లకు సంబంధించి లబ్ధిదారులకు తెలియకుండా మంజూరు చేసిన రుణ డబ్బులను తన ఖాతాలకు మళ్లించాడు. రూ.2,05,35,350లను తనకు చెందిన అపెక్స్ ఏసీసీ బ్రిక్స్ కంపెనీకి మళ్లించాడని తెలిపారు. ప్రస్తుత మేనేజర్ రవీందర్ ఫిర్యాదు మేరకు హరిప్రాసద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు చైన్‌స్నాచర్స్ ...

భువనగిరి టౌన్, ఆగస్టు 24: ఇద్దరు చైన్‌స్నాచర్స్‌ను అరెస్ట్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 11కేసుల్లో నిందితులైన నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన పేష్‌కారి శ్రీకాంత్, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రత్నావత్ మోహన్‌నాయక్ శనివారం బైక్‌పై భువనగిరి వైపునకు వస్తున్నారు. పోలీసు లను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా పట్టుకుని విచారించగా పాత నేరస్తులుగా తేలింది. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ ఖైదీలుగా జైలుకు తరలించినట్లు తెలిపారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 24 : బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన విద్యార్థిని(17) చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులోని మహాత్మాజ్యోతిరా పూలే బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 20న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన యువకుడు ఈశ్వర్ కళాశాలకు వెళ్లి విద్యార్థిని తమ బంధువు అని చెప్పి బయటకు తీసుకెళ్లాడు. విద్యార్థిని అదృశ్యంపై తల్లి, ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు ఈశ్వర్‌ను ఆదుపులోకి తీసుకున్నారు. విద్యార్థినిని తల్లితండ్రులకు అప్పగించారు. ఈశ్వర్‌పై బాలిక కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శిథిలావస్థలో ఏఎమ్మార్పీ కాల్వలు

నల్లగొండ జిల్లాలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతోపాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాల్వల్లో కంపచెట్లు పేరుకుపోయి, మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటిని విడుదల చేసినా వృథాగా పోయే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 136 కిలోమీటర్లు ఉంది. ప్రధాన కాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీల్లో ఇరువైపులా కంపచెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. మరమ్మతులకు అధికారుల ప్రతిపాదనలు ఆచరణలో ముందుకుపడటం లేదు.

- పెద్దఅడిశర్లపల్లి

నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు



కంపచెట్లు పేరుకుపోయి శిథిలావస్థకు చేరిన ఏఎమ్మార్పీ కాల్వ

పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి నుంచి ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా అక్కంపల్లి రిజర్వాయర్‌కు నీరు అందిస్తున్నారు. పుట్టంగండి ప్రధాన కాల్వలోకి డీ-7కాల్వ కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల రిజర్వాయర్ వరకు ఉంది.డీ-7 కాల్వ నుంచి ఎల్-1, ఎల్-2కాల్వల ద్వారా రాంపురం, మల్లాపురం, ఎర్రగుంట తండా,అజ్మాపురం గ్రామాల రైతులకు సాగునీరు అందించాల్సి ఉంటుంది. అయితే ఈ కాల్వలు కంపచెట్లతో నిండిపోయి ఉన్నాయి. దీంతో చివరి భూముల వరకు నీరు అందని పరిస్థితి. రైతులు స్వయంగా వ్యవసాయ భూముల పరిధిలో కాల్వలను శుభ్రం చేసుకుంటున్నారు. హైలెవల్ కెనాల్ 7బీ కాల్వకు నీరు అందకపోవడంతో గుడిపల్లి మండలం పోతిరెడ్డిపల్లి, గుడిపల్లి, గుర్రంపోడు మండలాల్లోని గ్రామాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలని గుడిపల్లి మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సాగర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఉండడంతో ఏఎమ్మార్పీ రైతుల తో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కులు జిల్లాలోని ఉదయ సముద్రానికి చెరువులు నింపడానికి విడుదల చేస్తున్నారు. దీంతో పాటు హైదరాబాద్ జంటనగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 50 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీలకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టాలని, సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



కాల్వలో కంపచెట్లను తొలగించాలి



ఏఎమ్మార్పీ కాల్వలకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. పట్టించుకునే నాథుడే లేడు. నీటిని విడుదల చేస్తే వృథాగా పోతోంది. మరమ్మతులు చేపట్టి రైతుల సాగు అవసరాలకు నీటిని అందించాలి.

- కొర్ర లాల్యానాయక్, ఎర్రగుంటతండా, పీఏపల్లి మండల రైతు

రూ.150 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం

ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు రూ.150 కోట్ల ప్రతిపాదనలు పంపించాం. కాల్వలకు మరమ్మతులు నిర్వహించి కంపచెట్లు తొలగిస్తాం. ప్రస్తుతం మూడు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నాం.

- సత్యనారాయణ, ఈఈ, ఏఎమ్మార్పీ

గుర్రంపోడు మండలంలోనూ అధ్వానస్థితిలో..

గుర్రంపోడు : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో ఏఎమ్మార్పీ కాల్వ అధ్వానస్థితిలో ఉంది. కాల్వ మొత్తం కంపచెట్లతో నిండిపోయిఉంది. లైనింగ్‌లు దెబ్బతిని పెచ్చులూడిపోతున్నాయి. దీంతో ఏఎమ్మార్పీ కాల్వ ప్రమాదకరంగా మారింది. మండలంలో డీ-17 నుంచి డీ-25 వరకు ఎనిమిది డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిసరఫరా జరుగుతోంది. మండలంలో మొత్తం 26వేల ఎకరాలకు ఏఎమ్మార్పీ ద్వారా సాగునీరు అందుతోంది. ఏఎమ్మార్పీ ద్వారా నీటి విడుదలతో ప్రస్తుతం కొప్పోలు, చేపూరు, మొసంగి, తాందారుపల్లి, తెరాటిగూడెం చెరువులు పాక్షికంగా నిండాయి. పుట్టంగండి వద్ద నాల్గో మోటారు మరమ్మతులకు గురికావడంతో ప్రస్తుతం విడుదలవుతున్న నీరు ఉదయసముద్రం నింపడానికే సరిపోతుంది. దీంతో డిస్ట్రిబ్యూటర్ల ద్వారా నీరు విడుదల చేయడం లేదు. ఒక టీఎంసీ సామర్థ్యం ఉన్న ఉదయసముద్రం నిండిన తర్వాత డిస్ట్రిబ్యూటర్లకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో మోటారు మరమ్మతు పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 25 నుంచి వారాబంధి పద్ధతిలో డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏఎమ్మార్పీ కాల్వలో కంపచెట్ల తొలగింపునకు ప్రతిపాదన సిద్ధం చేసి నిధులు మంజూరైన వెంటనే కంపచెట్లను తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. లైనింగ్ మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని అధికారులు తెలిపారు.



కంపచెట్లతో నిండి ఉన్న ఏఎమ్మార్పీ కాల్వ

చెరువులు నింపాలి



ఏఎమ్మార్పీ కాల్వ నీటి ద్వారా చెరువులు నింపితేనే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని విడుదల చేసి వారబంధి పద్ధతిలో నీటి విడుదల చేసేటప్పుడు రైతులు సంయమనం పాటించాలి.

- నామాల సురేందర్, రైతు

డీఈవో ఉత్తర్వులతో అయోమయం

- ప్రొసీడింగ్స్‌లో కొత్తగా ఏర్పాటైన మండలంగా అమ్మనబోలు
- మండలంగా ఏర్పాటు కానప్పుడు ఎలా పేర్కొంటారని చర్చ



Sl No	Name of the Mandal	Name of the MNO	Desg	Place of working	Contact No	Remarks
1	Chattuppal	J. Amrutha Devi	GHM	ZPHS Chattuppal	9490500880	Newly formed Mandal
2	Gudipally	S.Sreenaiah	GHM	ZPHS Gudipally	9491369603	Newly formed Mandal
3	Ammanabole	J Sekhar Reddy	GHM	ZPHS Ammanabole	9949703398	Newly formed Mandal

Therefore, the above Nominated Gazetted Headmasters are instructed to visit schools, 2 days in a week in a month as a part of Academic Monitoring for Quality Improvement in all the Government and Local Body Schools, KGBVs, URS, TG Model Schools and TREIS and attain to any other work assigned by the District Educational Officer, Nalgonda.

Encl:- Job chart of Mandal Nodal Officers

Dist. Educational Officer & EO. DPO. SS. Nalgonda

డీఈవో జారీ చేసిన ఉత్తర్వు కాపీ

నార్కట్‌పల్లి, ఆగస్టు 24 : డీఈవో ఉత్తర్వులు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామస్తులను అయోమయానికి గురిచేస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలో తమ గ్రామాన్ని చుట్టుపక్కల గ్రామాలతో కలిపి మండల కేంద్రంగా ప్రకటించాలని ఏడాదిపాటు గ్రామస్తులు రిలే దీక్షలు చేశారు. పార్టీలకతీతంగా ఈ దీక్షలోల్లో పాల్గొన్నారు. ప్రజాందోళనకు దిగివచ్చిన అప్పటి ప్రభుత్వం హడావిడిగా ఐదు గ్రామాలతో కూడిన అమ్మనబోలును మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రక్రియను ప్రారంభించింది. కొద్దిరోజులైతే గెజిట్ కూడా వెలువడేదేకానీ, ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో అమ్మనబోలు మండల ఏర్పాటుకు బ్రేక్ పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో నేటికీ మండల ఏర్పాటుపై అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా జిల్లా విద్యాశాఖాధికారి పేరిట తాజాగా జారీ అయిన ఓ ఉత్తర్వుల్లో అమ్మనబోలును కొత్తగా ఏర్పడిన మండలంగా పేర్కొనడం ఆశ్చర్యానికి, అయోమయానికి గురిచేస్తోంది.

తొలిమెట్టుకు ఎంఎన్‌వోగా..

ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా పాఠశాలల్లో తొలిమెట్టు పర్యవేక్షణ బాధ్యతను ఆయా మండలాల విద్యాధికారులపై అప్పగించింది. అయితే ఎంఈవోలు లేని మండలాల్లో జీహెచ్ఎంలలో సీనియర్లను ఎంపిక చేసి మండల నోడల్ అధికారులు(ఎంఎన్‌వో) నియమించి తొలిమెట్టు కార్యక్రమ పర్యవేక్షణ అదనపు బాధ్యతను అప్పగిస్తోంది. ఇందులో భాగంగా డీఈవో పేరిట ఈ నెల 22న ప్రొసీడింగ్స్ జారీ అయ్యాయి. ఇలా ఇటీవల గట్టుప్పల్, గుడిపల్లి మండలాలతో పాటు నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలుకు కూడా జే.శేఖర్‌రెడ్డి అనే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిని ఎంఎన్‌వోగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఆర్డర్ కాపీలోని పట్టిక రిమార్క్స్ కాలంలో గట్టుప్పల్, గుడిపల్లితో పాటు అమ్మనబోలును కూడా కొత్తగా ఏర్పాటైన మండలంగా పేర్కొంటూనే ప్రొసీడింగ్స్‌ను జారీ చేశారు.

చర్చకు దారితీసిన ఉత్తర్వులు

అమ్మనబోలు మండలంగా లాంఛనంగా ఏర్పాటు కానపుడు విద్యాశాఖ అధికారులు జారీ చేస్తున్న అధికారిక ఉత్తర్వుల్లో మాత్రం కొత్తగా ఏర్పాటైన మండలమంటూ పేర్కొనడం చర్చకు దారితీసింది. డీఈవో ఉత్తర్వులో అమ్మనబోలును కొత్తగా ఏర్పాటైన మండలంగా పేర్కొనడం యథాలాపంగా జరిగిందా? లేక సాంకేతికంగా విద్యాశాఖ మండలంగా గుర్తిస్తుందా అనేది అర్థం కావడం లేదు. గతంలో కూడా ఇదే రకంగా ఉత్తర్వులు రాగా సరిచేసినట్లు తెలిసింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వాన్‌రాజ్ (ఫైల్‌ఫొటో)

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 24 : గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. బాధిత కుటుంబసభ్యులు, వన్‌టౌన్ ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని షాబునగర్ కాలనీకి చెందిన జాదవ్ వాన్‌రాజ్(39) కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఈదులగూడకు వెళ్లాడు. బహిర్భూమికి వెళ్లివస్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వాన్‌రాజ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని సంఘటన జరిగినతీరును పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాన్‌రాజ్ సోదరుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్..



శోభన్‌బాబు (ఫైల్)

నిడమనూరు, ఆగస్టు 24: పొలంలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన గోలి శోభన్‌బాబు(37) తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూనే సొంతంగా ట్రాక్టర్ కూడా ఉండటంతో కిరాయికి నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన సిద్ధపంగు సైదులు అనే రైతు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేసేందుకు శోభన్‌బాబు కిరాయికి వెళ్లాడు. పొలంలో దమ్ము చేస్తుండగా బురద పొలం కావడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడటంతో బురదలో కూరుకుపోయాడు. గమనించిన సమీపంలోని కొందరు అక్కడకు చేరుకొని పొలం బురదలో కూరుకుపోయిన శోభన్‌బాబును వెలికితీసినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు చేరుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. శోభన్‌బాబుకు భార్య రాధ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

చిట్యాల, ఆగస్టు 24 : నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ మృతి చెందాడు. ఎస్ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన చిప్పలపల్లి కృష్ణయ్య (55) బైక్‌పై చిట్యాలకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది, ఈ సంఘటనతో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు బస్సు ఢీకొని..

మునగాల, ఆగస్టు 24 : ప్రైవేటు బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా మునగాల మండలం మొద్దుల చెరువు వద్ద జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణపాలెం గ్రామానికి చెందిన మలిరెడ్డి శ్రీనివాసరావు(52), భార్య, కుమార్తె, అల్లుడుతో కలిసి శుక్రవారం రాత్రి 10.30 తరువాత హైదరాబాద్ నుంచి కారులో విజయవాడ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొద్దులచెరువు స్టేజీ సమీపంలో కారు ఆపి మూత్రవిసర్జనకు రోడ్డు దాటి శ్రీనివాసరావు వెళ్లారు. మరల తిరిగి రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లుడు టీ శ్రీహరిచైతన్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విషపురుగు కాటుకు బాలుడు...



మణిచరణ్(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 24 :యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో విషపురుగు కాటుకు గురై బాలుడు మృతి చెందాడు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం అర్రూరు గ్రామానికి చెందిన లోతుకుంట స్వామి, పావని దంపతుల కుమారుడు మణిచరణ్(15) గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం నిద్ర లేవగానే ఒళ్లు నొప్పులు వస్తున్నాయని వాంతులు చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ సలహా మేరకు వలిగొండలోని ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. విషపురుగు కాటుకు గురైనట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలి పనికి వెళ్లి గుండెపోటుతో యువతి..



కవిత(ఫైల్)

గుర్రంపోడు, ఆగస్టు 24 : మిరపకాయలు ఏరడానికి వెళ్లి యువతి గుండెపోటుతో మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో జరిగింది. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన జక్కుల సత్తయ్య, రాములమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. కాగా చిన్న కుమార్తె కవిత(20) ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి ఇంటి వద్దే తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది. రోజు మాదిరిగానే తల్లి రాములమ్మతో కలిసి ఆటోలో మిరపకాయలు ఏరడానికి మండలంలోని మొసంగి గ్రామానికి వెళ్లింది. ఆటో దిగి పనికి ఉపక్రమించే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆ సమయంలో ఆటుగా వెళ్తున్న 108 వాహన సిబ్బంది అక్కడికక్కడే సీపీఆర్ చేసినప్పటికీ అప్పటికే పల్స్ పడిపోయాయి. మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి హుటాహుటిన తరలించగా మండల వైద్యాధికారి భవాని చక్రవర్తి పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మిగతా ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. గుండెపోటుతో యువతి మృతి చెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా

- మంత్రి కోమటిరెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ సహా పలువురి పరామర్శ



బాలకృష్ణారెడ్డి సతీమణితో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

భువనగిరి టౌన్ / భువనగిరి రూరల్, ఆగస్టు 24 : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్న ఆయన నెల రోజుల కిందట సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చేరాడు. అయితే జిట్టా ఆరోగ్య మరింత క్షీణించిందని జరుగుతున్న ప్రచారంతో ఆయన అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ మేరకు శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్యంపై వైద్యులతో మాట్లాడి పూర్తిస్థాయి వైద్యచికిత్సలు అందించాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆసుపత్రిని సందర్శించి, పరామర్శించారు. అలాగే హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోన్‌లో జిట్టా ఆరోగ్యంపై ఆరా తీశారు. జిట్టా అభిమానుల తాకిడితో యశోద ఆసుపత్రి కిక్కిరిసింది.

భువనగిరిలో అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్


- ప్రారంభమైన అండర్-18 క్వాలిఫై మ్యాచ్‌లు
- రేపటి నుంచి ప్రధాన టోర్నీ
- పాల్గొననున్న సుమారు 150 మంది దేశ, విదేశీ క్రీడాకారులు



భువనగిరిలో అంతర్జాతీయ అండర్-18 టెన్నిస్ సిరీస్ క్వాలిఫై మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

భువనగిరి టౌన్, ఆగస్టు 24: అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్‌కు యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రమైన భువనగిరి పట్టణం ఆతిథ్యం ఇస్తోంది. స్థానిక న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో ఐదు రోజుల పాటు జరుగనున్న రాజా నర్సింహారావు మెమోరియల్ ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ అండర్-18 సిరీస్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శని, ఆదివారాల్లో క్వాలిఫై మ్యాచ్‌లు జరుగనుండగా, ఈ నెల 26వ తేదీ నుంచి సెప్టెంబరు 1 వరకు ప్రధాన మ్యాచ్‌లు జరుగుతాయి. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో పాటు అమెరికా, కెనడా తదితర దేశాలకు చెందిన సుమారు 150మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఎనిమిది కోర్టుల్లో బాల బాలికలకు వేర్వేరుగా 100కు పైగా మ్యాచ్‌లు జరగనున్నాయి. టోర్నీని తొమ్మిది మంది అంపైర్లు, ఒక చీఫ్ రెఫరీ, ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ ప్రతినిధి జె.శివకుమార్‌రెడ్డి ఈ సిరీస్‌ను పర్యవేక్షించనున్నారు. అందుకు కోర్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులు భువనగిరికి చేరుకున్నారు. వారందరూ భువనగిరి, యాదగిరిగుట్టలోని హోటళ్లలో బస చేస్తున్నారు. విజేతలకు అంతర్జాతీయ ర్యాంకింగ్స్ కేటాయిస్తారు. ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఏఐటీఏ), తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్ (టీఎస్‌టీఏ), యాదాద్రి భువనగిరి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న టోర్నీకి న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీ అతిథ్యం ఇస్తోంది. ఆదివారం జరగనున్న టోర్నీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, టీఎస్‌టీఏ కార్యదర్శి కేఆర్.రామన్, ఉపాధ్యక్షుడు అశోక్ పాల్గొననున్నారు. కాగా, ఇదే అకాడమీలో ఈ ఏడాది ఏప్రిల్ 29నుంచి మే4 వరకు నేషనల్ టెన్నిస్ సిరీస్ జరగ్గా, నాలుగు నెలల వ్యవధిలోనే అంతర్జాతీయ టోర్నీని భువనగిరిలో నిర్వహిస్తుండడం విశేషం. ఇప్పటి వరకు భారత్‌లో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్‌లన్నీ ఢిల్లీ, చెన్నై, ముంబై, హైదరాబాద్ తదితర నగరాలకే పరిమితం కాగా, మొట్టమొదటి సారిగా గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు ఏఐటీఏ ప్రతినిధులు పేర్కొన్నారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో టెన్నిస్ అకాడమీలు ఉన్నట్లు టెన్నిస్ ప్రపంచానికి తెలియజేయడం, గ్రామీణ ప్రాంతాల్లోని టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతోనే భువనగిరిలో అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్‌ను నిర్వహిస్తున్నట్లు టీఎస్‌టీఏ ఉపాధ్యక్షుడు అశోక్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురి బలవన్మరణం




రాజశేఖర్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 24 : బీటెక్ పూర్తయి ఐదేళ్లు గడిచినా ఉద్యోగం రాక,పెళ్లి కాకపోవడంతో మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో జరిగింది. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి పట్టణం ఏడోవార్డుకు చెందిన రైతు తంగెళ్ల గణేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రాజశేఖర్(29), చిన్నకుమారుడు సురేష్. రాజశేఖర్ బీటెక్ పూర్తిచేసి ఐదేళ్లు గడిచింది. పెళ్లి కాలేదు. దీంతో అతడు మానసిక వేదనతో శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరివేసుకున్నాడు. తండ్రి గణేష్ పొలం నుంచి ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటిలోని గదిలో వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలిచి తలుపును పగలగొట్టి గణేష్‌ను ఉరి నుంచి తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అయితే ఈ సమయాన ఇంటిలో గణేష్ భార్య, చిన్నకుమారుడు సురేష్ లేరు. వారు ఆదిబట్లలో వస్త్ర దుకాణం పెట్టుకుని ఉండడంతో ఇక్కడ ఉండటం లేదు. రాజశేఖర్ మాత్రం తన తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండేవాడు. రాజశేఖర్ ఆత్మహత్య స్థానికులను కలచివేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత...

నల్లగొండ క్రైం : ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలో జరిగింది. రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చందనపల్లి గ్రామానికి చెందిన ఆండాలు(50) భర్తతో కలిసి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 22వ తేదీన ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఎకలకల మందు తాగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అండాలు శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతికి ఆర్థిక సమస్యలే కారణంగా తెలుస్తోంది. ఆండాలు కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రంగయ్యగూడెంలో విషాదఛాయలు



నరేష్‌వర్మ(ఫైల్)

పెన్‌పహాడ్ : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం రంగయ్యగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన తొగరు నరేష్‌వర్మ(27) హైదరాబాద్‌లోని షాద్‌నగర్ పరిధిలో శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధుమిత్రులు తెలిపిన వివరాల ప్రకారం తొగరు నరేష్‌వర్మ-శ్రావణి దంపతులు ఇద్దరు కుమారులతో గతేడాది జీవనోపాధి కోసం షాద్‌నగర్‌కు వెళ్లి నివాసముంటున్నారు. వచ్చే వేతనం సరిపోక బంధుమిత్రుల వద్ద అప్పుచేశాడు. దీంతో వేతనం డబ్బులు సరిపోక తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెందిన నరేష్‌వర్మ జీవితంపై విరక్తి చెంది షాద్‌నగర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు నరేష్‌వర్మను మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం రంగయ్యగూడానికి తీసుకరావడంతో బంధుమిత్రులు, చుట్టూపక్కల గ్రామాల మృతదేహాన్ని చూసేందుకు వచ్చి కంటతడిపెట్టారు. నరేష్ వర్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నరేష్‌వర్మ కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు నాయకులు కోరారు.

ఎయిమ్స్‌లో క్యాన్సర్‌కు అధునాతన వైద్యం



బీబీనగర్ ఎయిమ్స్‌లో హిమోథెరపి విభాగాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, ఆగస్టు 24: క్యాన్సర్ రోగులకు అత్యాధునిక పరిజ్ఞానంతో వైద్యం అందనుందని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఎయిమ్స్‌లోని రేడియోఅంకాలజీ విభాగంలో ఏర్పాటుచేసిన హిమోథెరఫి డ్రగ్స్ ప్రిపరేషన్ రూంతో పాటు వర్టికల్ సెమినార్‌లో అండ్ యంత్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో క్యాన్సర్ బారిన పడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోందని, ఇంతకాలం ఎయిమ్స్‌లో సరైన చికిత్స విభాగం లేదన్నారు. ప్రస్తుతం అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. క్యాన్సర్ రోగుల ప్రయోజనం కోసం ఈ విభాగాన్ని ఏర్పాటు చేయగా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా యాంటి క్యాన్సర్ హిమోథెరఫి చికిత్సను అందిస్తామన్నారు. ఎయిమ్స్‌లో తొలి హిమోథెరపి చికిత్సను ఈ ఏడాది మే 10న అందించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ జగదీశ్ చందర్ తదితరులున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురు అరెస్టు

- రూ.41లక్షల విలువైన 163.820 కిలోల గంజాయి, రెండు కార్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కొలను శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, ఆగస్టు 24 : గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.40 లక్షల విలువైన 163.820 కిలోల గంజాయితో పాటు రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌డీపీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ కొలను శివరాంరెడ్డి వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఉదయం డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో తిప్పర్తి ఎస్ఐ రాజు తమ సిబ్బందితో తిప్పర్తిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా అందులో గంజాయి లభించింది. కారులోని వారిని ప్రశ్నిస్తుండగా మొదటికారులోని ప్రహ్లాద్ అనే వ్యక్తి పారిపోగా కాస్లే నర్సింహా, గోవింద్ శివపాల్ సింగ్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. అదేవిధంగా రెండో కారులోని భీమరాజు, శివకోటి ఉమా మహేష్ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు కార్లలోని సుమారు రూ. 40,90,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కాస్లే నర్సింహ హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన వాడు కాగా గోవింద్ శివపాల్‌సింగ్ కర్ణాటక రాష్ట్ర బీదర్, నల్లగంటి భీమరాజు వికారాబాద్‌లోని బాచుపల్లి, శివకోటి ఉమామహేష్ తూర్పుగోదావరి జిల్లా సకినేటిపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. వీరిని విచారించగా కర్ణాటకకు చెందిన తమన్ అనే వ్యక్తి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి దగ్గర గోకవరం అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి తమన్‌కు చేరవేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయిని రవాణా చేసినందుకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున తమన్ ఇచ్చే వాడని వారు పేర్కొన్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ రాజు, సిబ్బంది రాజీవ్, ముజీబ్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు మహేందర్, రామకృష్ణ ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కోదాడ రూరల్, ఆగస్టు 24 : గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రెండురోజుల కిందట మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఐదుగురు వ్యక్తులు కూడా కోదాడ, మేళ్లచెర్వు మండలాలకు చెందిన వారుగా సమాచారం. ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఐదుగురు యువకులు కూడా ఉన్నతవర్గాలకు చెందిన యువకులు కావడంతో వారి పేర్లు తెలిపేందుకు పోలీసులు నిరాకరించారు. ఈ విషయంలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డిని వివరణ కోరగా, సీఐ ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తారని తెలిపారు. కానీ ప్రెస్‌మీట్ లేకుండానే ఐదుగురిని పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తూ రిమాండ్‌కు తరలించడం చర్చనీయంగా మారింది.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 24: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పోరాటం చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలో సంఘం రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. దేశంలో 70శాతంకు పైగా జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న టీయూడబ్ల్యూజే 25రాష్ట్రాల్లో నిర్మాణాత్మక సంఘంగా ఉందన్నారు. జర్నలిస్టు సంక్షేమం కోసం, వారు ఎర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 1957 నుంచి సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలను విస్మరించి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బంటు కృష్ణ, బత్తుల మల్లికా ర్జున్, రెబ్బ విజయ్‌కుమార్, తల్లాడ చందన్, పులుసు నాగరాజు, గుడిపూడి రామకృష్ణ, నరేందర్, రామకృష్ణ, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూర్యాపేటలో 21వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేటటౌన్, ఆగస్టు 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ సూచించారు. జిల్లాకేంద్రంలోని 21వార్డులో శనివారం పర్యటించారు. డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా మురుగు నీరును తొలగించాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, వాడిన కొబ్బరి బోండాలు, కూలర్‌లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

మేళ్లచెర్వు: దేవాలయాల ప్రాంగణాలు అధ్యాత్మికత శోభతో పాటు పచ్చదనం, పరిశుభ్రత ఆహ్లాదకర వాతావరణంలో ఆలయాలు ఉండాలని దేవాలయ శాఖ సహాయ కమిషనర్ ఎ. సులోచన అన్నారు. మండలకేంద్రంలోని ఇష్ట కామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, అర్చకుడు ధనుంజయిశర్మ, సిబ్బంది, కొండారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 24: రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి పంటలో అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయాధికారి దివ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అకాడమీ సికింద్రాబాద్ బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులను వివరించారు. రైతులు పంటలకు సహజ ఎరువులు తక్కువ మోతాదులో వాడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి ప్రోగ్రాం అసిస్టెంట్ ఆకుల నరేష్, వెంకన్న, మౌలానా, పిచ్చయ్య, దేవేందర్, ఎస్. వెంకన్న, మల్లయ్య, వెంకటయ్య, లింగయ్య, బిక్షం, వివేక్, వీరరాఘవ, ఉమేష్, బానుతేజ, రాజారావ్ పాల్గొన్నారు.

'ఆడపిల్లల చదువు దేశ భవిష్యత్తుకు పునాది'

మునగాల రూరల్, ఆగస్టు 24: ఆడపిల్ల చదువు దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి షేక్ మీరా అన్నారు. 'విద్యార్థి దశలో ఆలోచన విధానం, విద్యార్థి పాత్ర' అనే అంశంపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం పాఠశాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని, భవిష్యత్తు లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. పాఠశాల దశలో విద్యార్థి పూర్తిస్థాయిలో అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సునిత రాణి, ఉపాధ్యాయురాలు జ్యోతి, స్వాతి, విజయ నిర్మల, రేణుక, రజిత, కవిత, బాలరక్ష భవన్ అధికారులు ఎస్‌కె మీరా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషిచేయాలి

అనంతగిరి, ఆగస్టు 24: విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషిచేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాయిలసింగారం, త్రిపురారం, పోలవరం, అనంతగిరి, శాంతినగర్, గొండ్రేలా గ్రామాల్లో శనివారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు ప్రభుత్వం చెల్లించాలన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండవ ఉపేందర్, అంజనేయులు, భవసింగ్, నందా, బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలో చిననెమిల, గోరెంట్ల, ముకుందా పురం, కుక్కడం, రెడ్డిగూడెం, పోలుమళ్ల, మద్దిరాల గ్రామాల్లోని పాఠశా లల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. సోమయ్య, ఉప్పునూతల శేఖర్, ఆర్. రమేష్, వరికుప్పల గంగరాజు, శ్రీనివాస్, దార బిక్షం, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నపేట వాసికి అవార్డు ప్రదానం

గరిడేపల్లి, ఆగస్టు 24: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరారపు సతీష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ జానపద సామ్రాట్ పురస్కారం అందజేసింది. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని 22వ తేదీన విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జానపద జాతర-2024లో ఏపీ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోంశాఖ మంత్రి వంగాల పూడి అనిత నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు అపర్ణ, గంగ, రమణ, సంధ్య, మార్తా, జ్యో తి, అనిత, వీరబాబు పాల్గొన్నారు.





నూతన్‌కల్, జిల్లాకేంద్రంలోని జయ పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



నేరేడుచర్లలోని గురుకుల పాఠశాలలో..



కీతవారిగూడెంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో

గోకుల కృష్ణా..

జిల్లాలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి, గోపిక వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్టి కొట్టారు. గోపికలతో కలిసి కోలాటాలు, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.



సూర్యాపేటలో..



తుంగతుర్తి వెంపటి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోదాడలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



హుజూర్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి



మునగాలలో వివిధ వేషధారణల్లో చిన్నారులు



తిరుమలగిరిలో..



అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో..

నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మద్దిరాలలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

మద్దిరాల, ఆగస్టు 24: నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. 49 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీ డీవో సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, మార్త కృష్ణమూర్తి, పచ్చిపాల సుమతివెంకన్న, మద్దెల బిక్షపతి, మాన్‌సింగ్, అమృత మల్లు, శ్యాంరెడ్డి, తాళ్లపల్లి సురేష్, వల్లపు రమేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో 97మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై. నరేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ జాన్‌మహ్మద్ జుమ్మిలాల్, పాలకుర్తి రాజయ్య, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు. గౌరెల్లి-కొత్తగూడెం జాతీయ రహదారిలో భాగంగా తొండ గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మించాలని గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. తొండ గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మించాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కెర మహేష్, నీరటి ప్రవీణ్, గొలుసుల సురేష్, పోరెల్ల లక్ష్మయ్య, ఓడపెల్లి గణేష్ పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు హుస్సేన్

హుజూర్‌నగర్, ఆగస్టు 24: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి హుస్సేన్ కోరారు. మండలంలోని అమరవరంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగం చిన్నాభిన్నం అవుతోందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సైదా, వెంకటరెడ్డి, మీరా, సైదులు పాల్గొన్నారు.

గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 24: ప్రజాయుద్ధనౌక గద్దర్ పాట ఉన్నంత కాలం చిరస్మరణీయుడని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ అన్నారు. ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గాన సంస్మరణ సభ పోస్టర్‌లను జిల్లాకేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో శనివారం ఆవిష్కరించారు. ప్రజల తరుపున విప్లవ ఉద్యమంలో తన పాట, ఆటతో ప్రజల్లో చైతన్యం తీసుకువ చ్చారన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర వెలకట్టలేని దన్నా రు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌చారి, వర్రె ఆంజనేయులు, త్రిష, అర్చన, స్నేహ, అఖిల, మల్లీశ్వరీ, గణేష్, గాయత్రి, గోపి, మోహన్, అభినవ్, చైతన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల గొంతుక గద్దర్

పీడిత ప్రజల గొంతుక గద్దర్ అని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధుఅన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాల యంలో జరిగి సమావేశంలో మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో దోపిడీపై గళమెత్తారాన్నారు. అక్రమ కేసులను ఎదురొకని ప్రజలను చైతన్యం చేస్తూ ఉద్యమాలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రహమ్మత్ పాషా, సంతోష్‌రెడ్డి, పోరెళ్ల విప్లవ్‌కుమార్, ఉపేందర్, బాషపంగు సునీల్, సురేష్, సందీప్, వెంకటేష్, నగేష్ పాల్గొన్నారు.

'రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి'

అనంతగిరి, ఆగస్టు 24: బీసీలు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు బచ్చు రాజ్యం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు 23శాతం రిజర్వేషన్లనే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలంపల్లి సుధాకర్, నాగేశ్వరరావు, సతీష్, ముదిరాజ్ పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకోవాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

హుజూర్‌నగర్‌రూరల్ , ఆగస్టు 24: రంగస్థల, జానపద కళలను కాపాడుకోవాలని మునిసిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన జానపద కళా సంబరాల్లో మాట్లాడారు. అంతరించి పోతున్న కళలను కాపాడుకోవాలన్నారు. జాతరలు, పండుగల సందర్భంగా కళాకారులు ప్రదర్శనలు ఇవ్వాలన్నారు. కళలతో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో లింగన్న, అంజనేయులు, వీరు, దొంతగాని సత్యనారాయణ, దామోదర్, కంబాల శ్రీను, కొట్టు బాబు, చాగంటి సాయిలక్ష్మీ, వీరబాబు, నామ్‌జీ, వినోద్, మణి, భద్రాచలం, మణిదీప్, రాజారమేష్ పాల్గొన్నారు.

పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు

కోదాడ రూరల్, ఆగస్టు 24: కోదాడ, అనంతగిరి మండలాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతగిరి మండలంలోని కొత్తగూడెం, పాలారం తండా, పాలారం, పాతగోల్‌తండా, వసంతాపురం, వాయిల సింగారం, కోదాడ మండలంలోని గుడిబండ, కాపుగల్లు, రెడ్లకుంట, తొగర్రాయి, మంగలితండా గ్రామాల్లో గ్రామపంచాయతీల పక్కా భవనాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. అదేవిధంగా అనంతగిరి మండలంలోని అమీనాబాద్, అనంతగిరి, బొజ్జగూడెంతండా, పాలారం తండా, పాత గోల్‌తండా, శాంతినగర్, వాయిల సింగారం, కోదాడ మండలంలోని గణపవరం, కాపుగల్లు-1 సెంటర్, కాపుగల్లు-2 సెంటర్, కూచిపూడి గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాలకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో అంగన్‌వాడీ భవనానికి ప్రభుత్వం రూ.12 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతోనే నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

హుజూర్‌నగర్‌లో నేడు భజన సంకీర్తన పోటీలు

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 24: పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో అన్నమయ్య భజనమండలి ఆధ్వర్యంలో ఆదివారం భజన సంకీర్తన పోటీలు నిర్వహిస్తున్నట్లు భజనమండలి గౌరవ అధ్యక్షురాలు గుండా సుశీల, సంఘం అధ్యక్షుడు బాచిమంచి కొండయ్య కోరారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పాశ్చాత్య సంగీతాన్ని తట్టుకుని సంస్కృతి, సంప్రదాయాలు బతుకుతున్నాయఅని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కంబాల శ్రీనివాస్, సత్యనారాయణ, పద్మ, బిక్షం, అనంతలక్ష్మీ, నాగలక్ష్మీ, సైదులు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బస్‌డిపో నిర్మించాలి

తిరుమలగిరి, ఆగస్టు 24: తిరుమలగిరిలో బస్‌డిపో నిర్మించాలని డిపో సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడెం లింగయ్య, చిర్రబోయిన హన్మంతు, కటుకూరి ఉపేందర్, అనంతుల శ్రీను, వేల్పుల లింగయ్య, పాష, నలుగూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసకావొద్దు

తిరుమలగిరి, ఆగస్టు 24: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని అనం తారం మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని సూచించారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్, ప్రిన్సిపాల్ వేముల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

అర్వపల్లి, ఆగస్టు 24: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలంగాణ ఉపాధ్యాయ సంఘం, యూత్‌ఫర్ సేవ సహకారంతో శనివారం బ్యాగ్స్, డిక్షనరీలు పంపిణీ చేశారు. టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విద్యార్థి దశలో కేవలం చదువుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడా రంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు మల్లయ్య, మాధవి, భాస్కర్, మంగమ్మ, హరీష్ పాల్గొన్నారు.

మాజీమంత్రి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

చివ్వెంల, ఆగస్టు 24: మండల పరిధిలోని గుంజలూరులో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు చేయించిన మాజీమంత్రి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ అమరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, దొనకొండ శ్రీను, కోటయ్యచారి, వీరబోయిన నాగార్జున, పరాల మల్లికార్జున, ముత్తయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



కోదాడ రూరల్, ఆగస్టు 24: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం మండలంలోని రామలక్ష్మీపురంలో గ్రామస్థులు సన్మానించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదోన్నతులపై వెళ్ళిన ఉపాధ్యాయులు ఏ. హనుమంతరావు, బడుగుల సైదులును పాఠశాల ప్రధానోపాధ్యాయులు లిక్కి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుజాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొప్పుల సుభాష్ రెడ్డి, కొప్పుల లక్ష్మారెడ్డి, కొప్పుల అంజిరెడ్డి, అన్నెం అంజిరెడ్డి, సాగర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జ్యోతి రాణి, అంగన్వాడీ టీచర్ స్వరాజ్యం, పార్వతమ్మ, మధ్యాహ్న భోజన వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, ఆగస్టు 24: మండలంలోని కల్మలచెర్వు, గానుగుబండ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల విద్యుత్ సరఫరాకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అంతరాయం కలుగుతుందని గరిడేపల్లి విద్యుత్ ఏఈ రావిరాల నగేష్ తెలిపారు. కల్మలచెర్వు, గానుగుబండ గ్రామాల్లోని 33/11 సబ్‌స్టేషన్‌లలో కొత్త బ్రేకర్‌లు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోదాడ రూరల్: మండల పరిధిలోని తమ్మర అగ్రికల్చర్, తమ్మర గ్రామాలకు ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. 33కేవీ కోదాడ అవుట్‌డోర్ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ చేస్తున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఖాజా ఎజాజుద్దీన్‌ను గెలిపించాలి

కోదాడ రూరల్, ఆగస్టు 24: జిల్లా యూత్ కాంగ్రెస్ అభ్యరిగా ఖాజా ఎజాజుద్దీన్‌ని గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేసినట్లు తెలిపారు. 18-35 సంవత్సరాల వరకు ఓటువేసే హక్కు ఉంటుందని తెలిపారు. విత్‌ఐవైసీ అనే మొబైల్ యాప్ ద్వారా ఈ నెల 14 నుంచి సెప్టెంబరు 14 వరకు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఒక వ్యక్తి యాప్ ద్వారా ఆరు ఓట్లు వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీతారాం రెడ్డి, రేపూరి వెంకటాచారి, మందలపు శేషు, తొండపు సతీష్, పిఏసీఎస్ చైర్మన్‌లు ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, నంబూరి సూర్యం, మాజీ సర్పంచ్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.